# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 25-07-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ప్రజా ఆరోగ్య భద్రతే లక్ష్యంగా సంజీవని పథకాన్ని అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.
- రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా ప్రభుత్వం ఎప్పటికప్పుడు అవసరమైన చర్యలను చేపడుతోందని మంత్రి కె. అచ్చెన్నాయుడు తెలిపారు.
- ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారానే అత్యుత్తమ వైద్య సేవలు అందించాలనేది రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు.
- సింహాచలం శ్రీ వరహ లక్ష్మీనృసింహ స్వామి వారి గిరి ప్రదక్షిణను విజయవంతంగా నిర్వహించాలని మంత్రి వంగలపూడి అనిత అధికారులను ఆదేశించారు.

=====================

ప్రజల ఆరోగ్య భద్రతే ఎన్డీయే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. కర్నూలు జిల్లా ఆలూరులో సంజీవని కార్యక్రమం సందర్భంగా ఈ రోజు ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి ప్రసంగిస్తూ... సంజీవని ప్రాజెక్టును ఆగస్టు నెల నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేస్తామన్నారు. ఆరోగ్యవంతమైన కుటుంబం, ఆరోగ్యవంతమైన గ్రామం.. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. గ్లోబల్ హెల్త్ ఇండెక్స్ పెంచడానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రిడెక్టివ్, ప్రివెంటివ్, క్యూరేటివ్ విధానంలో ప్రజారోగ్య రక్షణే 'సంజీవని' విధానమని, ప్రజల వ్యక్తిగత ఆరోగ్య రికార్డులు తయారు చేసి వాటి ద్వారా ఆరోగ్య భద్రత ఇచ్చేందుకే సంజీవని ప్రాజెక్టు చేపట్టామన్నారు. ప్రతీ వ్యక్తి హెల్త్ ప్రొఫైల్ ను సంజీవని ద్వారా నమోదు చేస్తున్నామని తెలియజేశారు. ప్రజారోగ్యంతో పాటు.. ప్రజా సంక్షేమం కోసం వివిధ పథకాలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందని ముఖ్యమంత్రి వివరిస్తూ...

(వాయిస్ 24 సెకన్లు)

====================

రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా ప్రభుత్వం మార్కెట్ పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అవసరమైన చర్యలు చేపడుతోందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. అమరావతిలో ఆయన ఈరోజు పాత్రికేయులతో మాట్లాడుతూ... టమాటా ధరలు రైతులకు కిలోకు కేవలం 2 రూపాయలు మాత్రమే లభిస్తోందంటూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తప్పుడు ప్రచారం చేయడం బాధ్యతారాహిత్యమని అన్నారు. వాస్తవాలను వక్రీకరించి రైతులను అయోమయానికి గురిచేసేలా ప్రచారం చేయడం సరికాదని స్పష్టం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో టమాటా సగటు ధర కిలోకు 10 రూపాయల 55 పైసలుగా ఉందని, అన్నమయ్య జిల్లాలో 10 రూపాయల 58 పైసలు, మదనపల్లె మార్కెట్‌లో 11 రూపాయల ధర నమోదవుతోందని మంత్రి తెలిపారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు మార్కెట్‌లో సరఫరా, డిమాండ్‌ను సమతుల్యం చేసేందుకు వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించి తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించినట్లు అచ్చెన్నాయుడు తెలిపారు.

====================

ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారానే అత్యుత్తమ వైద్య సేవలు అందించాలనేది రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. గుంటూరు జిల్లా తెనాలిలోని ప్రభుత్వ ఆసుపత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన నవజాత శిశు సంరక్షణ కేంద్రంతో పాటు రొమ్ము క్యాన్సర్ స్క్రీనింగ్ ఆప్టికల్ ఇల్యూమినేటర్ పరికరాన్ని మంత్రి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య రంగాన్ని మరింత బలోపేతం చేస్తోందన్నారు. ఆధునిక వైద్య పరికరాలు, ప్రత్యేక చికిత్సా విభాగాల ఏర్పాటు ద్వారా ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను చేరువచేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా తల్లి-నవజాత శిశు సంరక్షణలో ఎంఎన్‌సీయూ కీలక పాత్ర పోషిస్తోందదని, నవజాత శిశువులకు అత్యవసర వైద్య సేవలు మరింత సమర్థవంతంగా అందించేందుకు ఇది ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. మహిళల్లో రొమ్ము క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించేందుకు అందుబాటులోకి వచ్చిన ఆప్టికల్ ఇల్యూమినేటర్ పరికరం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలియజేశారు. ఆసుపత్రి అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలను వేగంగా అమలు చేసి.. ప్రజలకు అన్ని రకాల వైద్య సేవలు ప్రభుత్వ ఆసుపత్రిలోనే అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు.

విరామం

====================

ఉత్తరాంధ్ర ఇలవేల్పు సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామి వారి గిరి ప్రదక్షిణను విజయవంతంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అధికారులను ఆదేశించారు. ఈ నెల 28, 29వ తేదీల్లో సింహాచలం గిరి ప్రదక్షిణ జరగనున్న నేపథ్యంలో ఏర్పాట్లపై ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి కలెక్టర్ కార్యాలయంలో హోం మంత్రి ఈరోజు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... 32 కిలోమీటర్ల మేర జరిగే గిరి ప్రదక్షిణ మార్గంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. అవసరమైన ప్రతి చోటా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి.. కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా నిరంతరం పర్యవేక్షించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమిష్టి కృషి, సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంత్రి అనిత అధికారులకు సూచిస్తూ...

(వాయిస్ 27 సెకన్లు)

====================

రాష్ట్రవ్యాప్తంగా సీడ్ బాల్స్ పంపిణీ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని ఉప ముఖ్యమంత్రి, అటవీ పర్యావరణ శాఖ మంత్రి కె. పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో అటవీ పునరుద్ధరణ, 50 శాతం గ్రీన్ కవర్ లక్ష్యాల్లో సీడ్ బాల్స్ పంపిణీ కార్యక్రమం అత్యంత కీలక ప్రక్రియ అని తెలిపారు. జిల్లాల వారీగా సీడ్ బాల్స్ పంపిణీ, వెదజల్లే కార్యక్రమం, డ్రోన్

సాంకేతికత వినియోగంపై అటవీ శాఖ ఉన్నతాధికారులతో ఈరోజు ఉపముఖ్యమంత్రి సమీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అడవులు క్షీణించిన ప్రాంతాల్లో సీడ్ బాల్స్ జారవిడిచే కార్యక్రమాన్ని వేగవంతం చేసేందుకు మరిన్ని డ్రోన్ల సహాయం తీసుకోవాలన్నారు. వర్షాలు కురుస్తున్న ప్రాంతాల్లో జాప్యానికి తావు లేకుండా సీడ్ బాల్స్ వెదజల్లే కార్యక్రమాన్ని కొనసాగించాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా 3 కోట్లకు పైగా సీడ్ బాల్స్ సిద్ధం చేయగా.. ఇప్పటి వరకు 63 లక్షలకు పైగా సీడ్ బాల్స్ దాదాపు 6 వేల 500 హెక్టార్ల విస్తీర్ణంలో వెదజల్లే ప్రక్రియ పూర్తి చేసినట్టు అధికారులు ఉపముఖ్యమంత్రికి తెలియజేశారు.

=====================

రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి విశాఖపట్టణంలోని సింహపురి ఈ-బస్సు డిపో పవర్ రూమ్‌ను ఈరోజు ప్రారంభించారు. 'PM e-Bus Sewa' పథకం కింద ఏర్పాటవుతున్న సింహపురి ఈ-బస్సు డిపోను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... విశాఖపట్టణానికి కేటాయించిన 100 విద్యుత్ బస్సుల నిర్వహణకు ఆధునిక పవర్ రూమ్ సిద్ధమైందని తెలిపారు. పవర్ రూమ్‌తో పాటు సబ్‌స్టేషన్, ఛార్జింగ్ స్టేషన్ తదితర మౌలిక సదుపాయాలు వేగంగా పూర్తికానున్నాయన్నారు. మరో రెండు, మూడు నెలల్లో ఈ-బస్సులు అందుబాటులోకి వస్తాయని వెల్లడించారు. ఈ-బస్సులు వచ్చే నాటికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రానికి తొలి దశలో 750 ఈ-బస్సులు రాగా.. అందులో విశాఖకు 100 బస్సులు కేటాయించినట్లు మంత్రి చెప్పారు. ప్రస్తుత బస్సులతో పాటు కొత్త ఈ-బస్సులతో ప్రయాణికులకు మరింత మెరుగైన సేవలు అందిస్తామని వెల్లడించారు. పర్యావరణహిత, ఆధునిక ప్రజా రవాణా వ్యవస్థ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం ఉన్నంత వరకు ఏపీఎస్ఆర్టీసీని ప్రైవేట్‌పరం చేయడం జరగదని.. అపోహలకు తావులేదని మంత్రి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు.

=====================

వికసిత్ భారత్ సంకల్పంలో భాగంగా దేశంలో 50 శాతం పచ్చదనం ఉండాలన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆలోచనలకు అనుగుణంగా ముందుకు వెళుతున్నామని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. రాజ్యసభ సభ్యులు భాష్యం రామకృష్ణతో కలిసి గుంటూరులోని శిల్పారామంలో ఈరోజు జరిగిన ఒక కార్యక్రమంలో మంత్రి.. క్లీన్ గుంటూరు పోస్టర్లను ఆవిష్కరించారు. పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్న వారిని ఈ సందర్భంగా సత్కరించారు. అనంతరం మాట్లాడుతూ... గుంటూరు పార్లమెంటు పరిధిలో నాటుతున్న లక్షా 20 వేల మొక్కలను జియో ట్యాగింగ్ తో కాపాడటం హర్షణీయమని అన్నారు. తాగునీరు, పచ్చదనం, మౌలిక సదుపాయాలతో రానున్న 10 సంవత్సరాల్లో వికసిత్ పట్టణంగా గుంటూరును మార్చనున్నామని కేంద్రమంత్రి పేర్కొన్నారు.

=====================
=====================